VC NEWS
# వేగుచుక్క
పీడిత ప్రజల గొంతుక...
TELUGU DAILY NEWS
www.veguchukkanews.com
నిజామాబాద్ గురువారం 03 అక్టోబర్ 2024
వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:02 సంచిక: 78
PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD



గాంధీ, శాస్త్రిలకు సీఎం రేవంత్ నివాళి

అక్కినేని కుటుంబాన్ని ప్రస్తావిస్తూ.. కేటీఆర్‌పై మంత్రి సురేఖ అనుచిత వ్యాఖ్యలు

సమంత విడాకులు, డ్రగ్స్,ఫోన్ ట్యాపింగ్‌తో బ్లాక్ మెయిల్ ఆరోపణలతో కలకలం

సురేఖ మాటలు సరికాదంటూ రాజకీయ, సినీ ప్రముఖుల నుంచి విమర్శలు

రాజకీయాల కోసం సినీ పరిశ్రమ మహిళలపై దుష్ప్రచారం చేయొద్దంటూ మండిపాటు

కొండా సురేఖ మెడలో నూలు దండ వేసిన ఘటనపై బీఆర్ఎస్ సోషల్ మీడియా ట్రోలింగ్‌తో వివాదం మొదలు

బట్టలూడదీసి కొడతామన్న సురేఖ.. ఫినాయిల్‌తో నోరు కడుక్కోవాలన్న కేటీఆర్

అక్కినేని కుటుంబాన్ని ప్రస్తావిస్తూ కేటీఆర్‌పై సురేఖ ఆక్షేపణీయ వ్యాఖ్యలు

తీవ్రస్థాయిలో విరుచుకుపడిన బీఆర్ఎస్ శ్రేణులు.. లీగల్ నోటీసు ఇచ్చిన కేటీఆర్

## కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య..
# చౌకబారు రాజకీయం!



2లో







# గడియారం గుర్తు

## సుప్రీం కోర్టును ఆశ్రయించిన శరద్ పవార్

ముంబై: మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఎన్సీపీ పార్టీ చిహ్నం (గడియారం) గుర్తు కేటాయింపు విషయంలో ఎన్సీపీ (ఎస్పీ) చీఫ్ శరద్ పవార్ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఆశ్రయించారు. ఈ మేరకు బుధవారం ఆయన సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఓటర్లలో గందరగోళాన్ని నివారించడానికి అజిత్ పవార్ నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ) చిహ్నమైన 'గడియారం' గుర్తుకు బదులు గుర్తు కోసం దరఖాస్తు చేసుకోవాలని వాదిస్తూ.. శరద్ పవార్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియలో న్యాయబద్ధత, స్పష్టతను నిర్వహించటంలోని ప్రాముఖ్యతను పిటిషన్ పేర్కొన్నారు.ఎన్సీపీ పార్టీ రెండు వర్గాలుగా

చీలిపో?యిన అనంతరం.. ఎన్సీపీ(ఎస్పీ) పార్టీకి భారత ఎన్నికల సంఘం తాత్కాలికంగా 'మ్యాన్ బ్లోయింగ్ ఎ తుర్హా'(బాకా ఊదుతున్న వ్యక్తి) గుర్తును మంజూరు చేసిన విషయం తెలిసిందే. అయితే తమకు గడియారం గుర్తుతో 25 ఏళ్ల అనుబంధంద ఉంది. గడియారం గుర్తును అజిత్ పవార్ వర్గం ఉపయోగించుకోవడానికి అనుమతిస్తే.. ఓటర్లను తప్పుదారి పట్టించినట్లు అవుతుందని ఎన్నికల నిష్పక్షపాతానికి విఘాతం కలిగుతుందని శరద్ పవార్ సుప్రీం కోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లో పేర్కొన్నారు.



# డబ్బుల కోసంమే మూసీ సుందరీకరణ

### హైడ్రాను నడిపిస్తున్నదే రాహుల్ గాంధీ

### మీడియాతో చిట్‌చాట్‌లో కెటిఆర్ విమర్శలు

హైదరాబాద్:డబ్బు సంచుల కోసమే మూసీ సుందరీకరణ ప్రాజెక్టుకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ అనుమతిచ్చారని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. రాహులే వెనకుండి పేదల ఇళ్లపైకి బుల్డోజర్ పంపిస్తున్నారని ఆరోపించారు. హైడ్రాను నడిపిస్తోంది సీఎం రేవంత్‌రెడ్డి కాదని.. రాహుల్ గాంధీయేనని వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లో మీడియాతో కేటీఆర్ మాట్లాడారు. కేవలం డబ్బు కోసమే మూసీ ప్రాజెక్టును చేపట్టారు. సీఎం రేవంత్ రెడ్డి చేపట్టింది మూసీ బ్యూటిఫికేషన్ కాదు.. మూసీ లూటిఫికేషన్ అనికేటీఆర్ ధ్వజమెత్తారు. మూసీ సుందరీకరణపై డీపీఆర్ కాదు.. ప్రాజెక్టు రిపోర్టు కూడా లేదని తెలిపారు. తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో చిట్ చాట్ చేశారు.

మూసీ ప్రాజెక్టు కోసం డబ్బులు ఎక్కడ్నుంచి తెస్తారు..? అని కేటీఆర్ నిలదీశారు. మూసీపై రెండు, మూడు రోజుల్లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తాను అని తెలిపారు. మూసీ విషయంలో సీఎంకు, మంత్రులకు సయోధ్య ఉన్నట్లు లేదన్నారు. మూసీ ప్రాజెక్టుకు లక్షన్నర కోట్లని ఎవరు చెప్పారని శ్రీధర్ బాబు అంటున్నారు. అభినవ గోబెల్స్ రేవంత్ రెడ్డి ఈ విషయాన్ని చెప్పారని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ సీఎం మంత్రివర్గ విస్తరణ కూడా చేసుకోలేని అసమర్థుడు అని కేటీఆర్ విమర్శించారు. డబ్బు సంచుల కోసమే మూసీ ప్రాజెక్టుకు రాహుల్ అనుమతి ఇచ్చారు. రేవంత్ రెడ్డి కాదు.. రాహుల్ గాంధీనే హైడ్రాను నడిపిస్తున్నారు. రాహుల్ వెనుకుండి పేదల ఇండ్లపైకి బుల్డోజర్ నడిపిస్తున్నారు.

కేవలం డబ్బుల కోసమే మూసీ ప్రాజెక్టును రాహుల్ చేపట్టారు. బుల్డోజర్ ప్రభుత్వంతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే రాహుల్ ఎక్కడున్నారు.. మూసీ ప్రాజెక్టును ఏ కాంట్రాక్టర్‌కు ఇస్తారో త్వరలో బయటపెడుతా. కాంగ్రెస్‌కు నోట్ల కట్టలు కావాలి.. కానీ బాధితుల కష్టాలు పట్టవా.. అని కేటీఆర్ నిలదీశారు.



# డిజిటల్ హెల్త్ కార్డు ప్రొఫైల్ రూపకల్పన

### 238 ప్రాంతాల్లో పైలట్ సర్వే

### నేడు ప్రారంభించనున్న సిఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్:** కుటుంబ డిజిటల్ హెల్త్ కార్డు ప్రొఫైల్ రూపకల్పన పక్రియను ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించబోతున్నది. ఈ మేరకు డిజిటల్ హెల్త్ కార్డును అమల్లోకి తీసుకుని రాబోతున్నది. ఎలాంటి భేదాలు లేకుండా ప్రజలందరికీ హెల్త కార్డుల వివరాలు పొందు పర్చనుంది. ఈ మేరకు గురువారం పైలట్ ప్రాజెక్టను సిఎం రేవంత్ ప్రారంభిస్తారు. మరోవైపే ఈ అంశంపై చర్చించినరెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ప్రతి కుటుంబానికి హెల్త్ ప్రొఫైల్ రూపొందించి, ప్రత్యేక నంబరుతో స్మార్ట్ కార్డులివ్వనున్నట్లు తెలిపారు. ఇందుకోసం ఈ నెల 3 నుంచి 7వ తేదీ వరకు 119 నియోజకవర్గాల్లోని 238 ప్రాంతాల్లో పైలట్ సర్వే నిర్వహిస్తున్నారు. పైలట్ ప్రాజెక్టును సీఎం రేవంత్ రెడ్డి గురువారం ప్రారంభిస్తారు. అత్యంత ప్రాముఖ్యం కలిగిన ఈ కార్డుల కోసం పొరపాట్లకు తావు లేకుండా వివరాలు నమోదు చేయించాలని కలెక్టర్లను ఇప్పటికే ఆదేశించారు. నియోజకవర్గంలో ఒక పట్టణ, ఒక గ్రామీణ ప్రాంతాన్ని ఎంచుకుని ఎన్యుమరేషన్ చేపడతారు.. ఒకవేళ పూర్తిగా అర్బన్ ప్రాంతమైతే రెండు వార్డులు/డివిజన్లు ఎంచుకుంటారు. ప్రతి నియోజకవర్గానికి ఆర్డీవో స్థాయి, జోనల్ కమిషనర్ స్థాయి అధికారులను, మండలానికైతే ఒక తహసీల్దారును ప్రత్యేకాధికారులుగా నియమించారు. కుటుంబసభ్యుల వివరాల నమోదు, మార్పుచేర్పుల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఇందుకు అనుగుణంగా డిజిటల్ సర్వేకు అధికారులు రంగం సిద్ధం చేశారు.

# మూసీ బాధితులకు అండగా బిజెపి పోరాటం

## నేటి నుంచే కార్యాచరణ ఉంటుంది
## మూసీ బాధితులను పరామర్శించిన కిషన్ రెడ్డి

2లో





అంగరంగ వైభవంగా ప్రారంభమైన
## బతుకమ్మ వేడుకలు

# ప్రశాంత్ కిశోర్ జన్ సురాజ్ పార్టీ

### అధికారికంగా ప్రారంభించిన వ్యూహకర్త



న్యూఢిల్లీ:ఎన్నికల మాజీ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ కొత్త రాజకీయ పార్టీని బుధవారం అధికారికంగా ప్రారంభించారు. 'జన్ సురాజ్ పార్టీ' పేరుతో కొత్త పార్టీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రసంగించిన ఆయన.. తమ పార్టీ రెండేళ్లుగా క్రియాశీలంగా ఉందని, ఎన్నికల సంఘం నుంచీ ఆమోదం పొందిందని వెల్లడించారు. దీంతో బిహార్‌లో రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధమవుతుందని అన్నారు. కొత్త పార్టీని అధికారికంగా ప్రకటించాం. అయితే.. ఈ పార్టీకి నాయకత్వం మాత్రం నా చేతుల్లో లేదు. రెండేళ్లుగా దీని కోసం శ్రమించిన వారే ఈ నిర్ణయం తీసుకుంటారని ప్రశాంత్ కిశోర్ పేర్కొన్నారు. గత 30 ఏళ్లుగా బిహార్ ప్రజలు ఆర్జేడీ లేదా జేడీయూ లేదా భాజపాకు మాత్రమే ఓటు వేస్తున్నారు. ప్రస్తుతం ఈ సంప్రదాయం అంతం కావాలి. మా పార్టీ రాజవంశానికి చెందినది కాదని అన్నారు. జన్ సురాజ్ పార్టీని కేంద్ర ఎన్నికల సంఘం గుర్తించినట్లు వెల్లడించారు. భాజపాతో కలిసి తమ పనిచేస్తుందంటూ కొన్ని విపక్షాలు చేస్తోన్న ఆరోపణలకు ఆయన కౌంటర్ ఇచ్చారు. బిహార్ విద్యా వ్యవస్థలో గణనీయమైన మార్పునకు పిలుపునిచ్చిన పీకే.. విద్యారంగంలో ప్రపంచ స్థాయి ప్రమాణాలను సాధించేందుకు రాబోయే పదేళ్లలో రూ.5లక్షల కోట్లు అవసరమవుతాయని చెప్పారు.

## తొలగించిన కార్మికులను పనిలోకి తీసుకోవాలి

**విశాఖపట్టణం:** విశాఖ స్టీల్ ప్లాంట్ కార్మికులకు మద్దతుగా పిసిసి చీఫ్ వైఎస్ షర్మిల దీక్షకు దిగారు. చంద్రబాబు నలభై ఎనిమిది గంటల్లో 4200 మంది స్టీల్ ప్లాంట్ కాంట్రాక్ట కార్మికులను వెంటనే పనిలోకి తీసుకోనేలా చర్యలు తీసుకోవాలన్నారు. లేకపోతే నిరాహారదీక్ష ప్రారంభిస్తానని హెచ్చరించారు. కూర్మనపాలెం స్టీల్ ప్లాంట్ దీక్ష శిభిరంలో కార్మికుల ఆందోళనకు సంఘీభావం తెలిపారు. దీక్షా శిబిరం వద్ద రోడ్డుపై బైఠాయించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుకు నిరసన తెలిపారు. కనీసం నోటీసు ఇవ్వకుండా కాంట్రాక్టు కార్మికులను తొలగిస్తుండటం దారుణమని.. నిర్వాసితులకు ఉద్యోగాలిస్తామని ఇవ్వకుండా రోడ్డున పడేశారని మండిపడ్డారు. కనీసం కాంట్రాక్ట్ పనులు చేసుకోనే వీలులేకుండా చేశారని.. ఆవేదన వ్యక్తం చేశారు. స్టీల్ ప్లాంట్ ను నిలబెట్టింది కాంగ్రెస్ పార్టీనేనని.. కాంగ్రెస్ పార్టీ కేంద్ర, రాష్ట్రాల్లో అధికారంలో లేకపోవడంతో ప్రైవేటీకరణకు సిద్ధమయ్యారని ఆరోపించారు. కేంద్రానికి భూముల మీద కన్ను ఉంది.. ప్రైవేటీకరణ చేస్తే లాక్కోవచ్చుని కుట్ర చేస్తోందన్నారు. స్టీల్ ఎ÷-లాంట్ కార్మికులకు ఇప్పటి వరకు ఎటువంటి భరోసా ఇవ్వడం లేదని.. కనీసం రా మెటీరియల్ కొనుక్కోనే పరిస్థితి కూడా ఉక్కు పరిశ్రమకు లేదన్నారు. పాలకుల నిర్వాకం వల్లే ఎ÷-లాంట్ ను నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు. నష్టాల సాకును చూపి ప్రైవేటీకరణ చేయాలని చూస్తున్నారని.. చంద్రబాబు, జగన్ ఎటువంటి భరోసాను ప్లాంట్ కార్మికులకు చేయడం లేదని ఆరోపించారు. చిత్తశుద్ధితో ఆదుకునే ప్రయత్నం ఎవరూ చేయడం లేదని.. ప్రస్తుతం స్టీల్ ప్లాంట్ ఒక మిలియన్ టన్నుల ను కూడా ఉత్పత్తి చేయలేని దుస్థితిలో ఉందన్నారు. జగన్ స్టీల్ ఎ÷-లాంట్ నష్టాల్లో ఉందా అని అడిగారట అని ఆయనకు ఏమీ తెలియదని ఎద్దేవా చేశారు. ఇక చంద్రబాబు మాటలు తప్ప చేతలు ఉండవన్నారు. వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు శిబిరానికి రావాలని.. 14 వేల మంది కాంట్రాక్టు కార్మికులకు భోరాసాను ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులను పర్మినెంట్ చేస్తున్నామని, స్టీల్ ఎ÷-లాంట్ స్పష్టమైన వైఖరిని చంద్రబాబు ప్రకటించాలన్నారు. స్టీల్ ఎ÷-లాంట్ పరిరక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల స్పందించకపోతే నిరాహార దీక్షలు ధర్నాలు రాస్తారోకోలు చేస్తామని అవసరమైతే ఢిల్లీలో అయినా చేస్తామన్నారు. స్టీల్ ప్లాంట్ నుచి ఇటీవల నాలుగు వేల మంది కాంట్రాక్ట్ కార్మికులను తొలగించారు. స్టీల్ ఎ÷-లాంట్ కు ముడిసరుకు సమస్య ఉండటంతో ఉత్పత్తి సరిగ్గా జరగడం లేదు. ఈ కారణంగాభారీగా నష్టాలు వస్తున్నాయి. జీతాలు ఇవ్వలేని పరిస్థితుల్లోకి వెళ్లిపోయారు. దీంతో కాంట్రాక్ట్ కార్మికులను తొలగించారు. దీనిపై కార్మికులు ఆందోళన చేస్తున్నారు. వీరికి మద్దతుగా కాంగ్రెస్ పార్టీ ఏపీ అధ్యక్షురాలు షర్మిల ధర్నాకు మద్దతుగా నిలిచారు.

## అన్ని రంగాల్లో కూటమి ప్రభుత్వం విఫలం

అమరావతి: కూటమి ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలం అయ్యిందని, ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని మాజీ సిఎం, వైకాపా అధినేత వైఎస్ జగన్ అన్నారు. ఎన్డీయే ప్రభుత్వం ఏర్పాటైన 4 నెలల్లోనే వారిపై తీవ్ర వ్యతిరేకత వచ్చింది. సూపర్ సిక్స్ లేదు.. సూపర్ సెవెనూ లేదు. స్కూల్స్ పోయాయి, చదువులు పోయాయి. విద్యాదీవెన, వసతి దీవెన, అమ్మఒడి అటకెక్కాయి. ఆస్పత్రుల అభివృద్ధి, ఆరోగ్యశ్రీ, రేషన్ డోర్ డెలివరీ, వాలంటీర్ల వ్యవస్థ, రైతు భరోసా పోయింది. వ్యవసాయం సహా అన్ని రంగాల్లో పరిపాలన కుప్పకూలింది. విద్య, వైద్య, ఆరోగ్యం, వ్యవసాయ రంగాల్లో రాష్ట్రం తిరోగమనంలో చెందుతోంది. సీఎం చంద్రబాబు మోసాలపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారు. ఏపీలో రెడ్ బుక్ పరిపాలన కొనసాగుతోందన్నారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో వైసీపీ పార్టీ అనుబంధ సంఘాలతో మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి సమావేశం నిర్వహించారు. పార్టీని బలోపేతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించి అనుబంధ సంఘాల నేతలకు దిశానిర్దేశర చేశారు. ఏపీ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి గట్టిగా తీసుకెళ్లాలని వారిని ఆదేశించారు. వైసీపీ అనుబంధ నూతన సంఘాలు, వాటి జిల్లా అధ్యక్షులను ఇటీవల వైసీపీ అధినేత నియమించారు. ఈ మేరకు రానున్న రోజుల్లో గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకూ పార్టీ బలపేతంపై సుదీర్ఘంగా చర్చించారు. పార్టీ శ్రేణులు, అనుబంధ విభాగాలు ఇకపైన యాక్టివ్ పనిచేయాలని జగన్ ఆదేశించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ..' వైసీపీ నేతలపై తప్పుడు కేసులు పెడుతున్నారు. లా అండ్ ఆర్డర్ ఎక్కడా కనిపించడం లేదు. పారదర్శకత అన్నది ఎక్కడా లేదు. విజయవాడ వరద బాధితుల కష్టాలు వర్ణనాతీతం. ఎన్యుమరేషన్‌ను సరిగ్గా చేయలేక పోయారు. కలెక్టర్ల కార్యాలయం చుట్టూ బాధితులు తిరగాల్సిన పరిస్థితి నెలకొంది. తమకు నచ్చిన వారికి మాత్రమే డబ్బులు ఇస్తున్నారు. వైసీపీ బాగుంటేనే మనమంతా బాగుంటాం. పార్టీలో కష్టపడి పనిచేసే వారికే ప్రాధాన్యత. నేను కేవలం మీ అందరి ప్రతినిధిని మాత్రమే. వైసీపీ మనందరిదీ అన్న విషయాన్ని గుర్తించుకోండి. పార్టీ కోసం కష్టపడే వారికి, ఆ పక్రియలో నష్టపోయిన వారికీ పూర్తిగా అండగా ఉంటాం. వారికే ప్రథమ ప్రాధాన్యత ఉంటుంది. క్షేత్రస్థాయి నుంచి వైసీపీని మరింత బలోపేతం చేద్దాం. దేశంలో అత్యంత బలమైన పార్టీగా తీర్చిదిద్దే కార్యక్రమాన్ని మొదలుపెట్టాం. మనకు లక్షల మంది కార్యకర్తలు, కోట్ల మంది అభిమానులు ఉన్నారు. ఏపీలో పరిపాలన ఘోరంగా ఉంది. అందుకనే ప్రజల్ని డైవర్ట్ చేయడానికి
కొత్త టాపిక్స్ తెరమీదకి తెస్తున్నారు. ఆ కొత్త టాపిక్స్ ఏంటో ప్రత్యేకంగా నేను చెప్పాల్సిన అవసరం లేదు. వీళ్ల పనులతో దేవుడికే ఆగ్రహం తెప్పిస్తున్నారు. పార్టీని బలోపేతం చేసే కార్యక్రమాలు మొదలుపెట్టా. గ్రామాల వరకూ అనుబంధ విభాగాల నిర్మాణం జరగాలి. పార్టీ పిలుపు ఇస్తే పైస్థాయి నుంచి కిందిస్థాయి వరకూ కదలిక రావాలి. ప్రజల తరఫున పోరాటాల్లో చురుగ్గా ఉండాలని చెప్పారు.

## మూసీ బాధితులకు అండగా బిజెపి పోరాటం

**హైదరాబాద్:** హైడ్రా, మూసీ కూల్చివేతల విషయంలో బీజేపీ కార్యచరణ గురువారం ప్రకటిస్తామని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. మూసీ సుందరీకరణలో భాగంగా నిర్వాసితులయ్యే బాధితులను ఆదుకునేందుకు తమ పోరాటం ఉంటుందని ఆయన తెలిపారు. మూసీ పరివాహక ప్రాంతాల్లో బుధవారం కిషన్ రెడ్డి పర్యటించారు. ఆయన వెంట బిజెపి నేత మురళీధర్ రావు తదితరులు ఉన్నారు. అంబర్‌పేట్, అసెంబ్లీ, ముసారాంబాగ్, అంబేద్కర్ నగర్, తులసి నగర్ మీదుగా కృష్ణానగర్ వరకూ బస్తీలను సందర్శించారు. కేంద్రమంత్రి స్వయంగా వెళ్లి నిర్వాసిత కుటుంబాల బాధలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మూసీ నిర్వాసితులు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఎదుట తమ గోడు వెల్లబోసుకున్నారు. ఇళ్లు కోల్పోతే రోడ్డున పడే పరిస్థితి వస్తుందంటూ కిషన్ రెడ్డి ఎదుట కన్నీటి పర్యంతం అయ్యారు. సారూ.. మీరే దిక్కంటూ బోరున విలపించారు. ఏళ్లుగా ఇక్కడే ఉంటున్నామని, తమను ఇక్కడ్నుంచి పంపించవద్దంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నో డబ్బులు ఖర్చు చేసి ఇళ్లు కట్టుకున్నామని చెప్పారు. ఇలాంటి పరిస్థితి వస్తుందని కలలో కూడా ఊహించలేదని అన్నారు. తమను ఆదుకునేందుకు
ముందుకు రావాలిని కోరారు. అయితే కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి బాధితులను ఓదార్చారు. ఇళ్లు కూల్చే పరిస్థితి వస్తే తానే అడ్డుగా నిలబడి కాపాడతానని ఆయన వారికి హామీ ఇచ్చారు. ఎవరూ అధైర్య పడొద్దని, మీ అందరికీ బీజేపీ తోడుగా ఉంటుందని భరోసా కల్పించారు.పేదలకు అండగా ఉండటం కోసమే మేము చేపట్టేబోయే భవిష్యత్తు ప్రణాళిక ఉంటుంది. ఈసారి మేము ఏదీ చెప్పి చేయం. హైడ్రా కూల్చివేతలపై బీఆర్ఎస్ నేత కేటీఆర్ ఏం మాట్లాడుతున్నారో ఆయనకే తెలియదని కిషన్ రెడ్డి అన్నారు. ఇళ్ల కూల్చివేతలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారు. ఇళ్ల కూల్చడంతో కేంద్రానికి ఏం సంబంధమో ఆయనే చెప్పాలి. ఇది రాజకీయాలు మాట్లాడే సమయం కాదు. పరస్పర రాజకీయ విమర్శలు తర్వాత చేసుకోవచ్చు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం వల్ల వేలాది మంది పేదలు రోడ్డున పడే ప్రమాదం ఏర్పడింది. పేదలకు అండగా ఉండటం కోసం జైలుకు వెళ్లేందుకైనా సిద్ధం. మూసీ బాధితులకు బీజేపీ అండగా ఉంటుంది. ఎవరూ భయపడాల్సిన పనిలేదు. మీ కోసం మేము నిలబడతాం. రేపట్నుంచే కొత్త కార్యచరణ అమలు చేయబోతున్నాం. కాంగ్రెస్ బుల్డోజర్లకు అడ్డుగా నిలబడతాం. మీ ఆస్తులకు నష్టం జరగనివ్వం'అని హామీ ఇచ్చారు.

## డిసెంబరు 2025 నాటికి బందరు పోర్టు నిర్మాణం

తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే అన్ని వ్యవస్థలనూ గాడిలో పెడతామని సీఎం చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ..'బందర్ పోర్టు పనులను ఆకస్మిక తనిఖీ చేశాం. 3669 పీపీ మోడల్‌లో 2025 అక్టోబర్ నాటికి ప్రాజెక్టు పూర్తి చేయాల్సి ఉంది. ఇప్పటివరకూ రూ.885కోట్ల పనులు మాత్రమే జరిగాయి. డెవలపర్‌ని పిలిచి డెడ్ లైన్ పెడతా. పోర్ట్ పనులు పూర్తి చేయకపోతే చర్యలు ఉంటాయి. ప్రాజెక్టుకు ఇంకా 36.30ఎకరాలు ఇవ్వాల్సి ఉంది. ఈ విషయాన్ని కలెక్టర్‌కు చెప్పాం. పోర్ట్ ÷నైల్ ప్రాజెక్టుకు 3,696 ఎకరాలు అవసరం. ఇది పూర్తయితే మచిలీపట్నం వేగంగా అభివృద్ధి చెందుతుంది. అమరావతికి దగ్గరగా ఉండే ఓడరేవు ఇది. రాజధానిగా పోర్టుగా దీన్ని అభివృద్ధి చేస్తాం. తద్వారా అన్ని ప్రాంతాలకూ మంచి జరుగుతుంది. ఇసుక కొరత ఉందని చెప్పారు. ఫాస్ట్ ట్రాక్‌లో ఇవ్వాలని చెప్పాం. పరిశ్రమలకు ఇక్కడ అవకాశం ఇస్తే ఎగుమతులు పెరుగుతాయి. అనేక అవకాశాలు పరిశీలించి ఇక్కడ పరిశ్రమలను ప్రోత్సహిస్తాం. మంచి పోర్టుగా అభివృద్ధి చేసి చూపుతాం. మచిలీపట్నం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉంది. గతంలో నేనే ఈ ప్రాజెక్టు ప్రారంభించా. మళ్లీ వాళ్లు మొదలుపెట్టి పనులు ఆపేశారు. ఈసారి బందర్ పోర్టు పూర్తి చేసి చూపుతాం. ఎంతోమంది ఈ ఓడరేవు కోసం పెద్దపెద్ద ఉద్యమాలు చేశారు. ప్రస్తుతం నాలుగు బెర్తులు ఉన్నాయి. పెంచాల్సిన అవసరం ఇప్పుడు లేదు. అవసరమైతే భూ సమీకరణ మళ్లీ చేపడతాం. బందర్ ఓడరేవు, రైల్వే లైన్, జాతీయ రహదారిలతో మచిలీపట్నం రూపు రేఖలు మారిపోతాయి. జనవరి నాటికి పి-4 అమల్లోకి తెస్తాం. ప్రభుత్వ ఆస్తులను గత ప్రభుత్వం దోచుకుంది. వాటిపై విచారణ చేసి స్వాధీనం చేసుకుంటాం. ఆంధ్ర జాతీయ కళాశాలను ప్రభుత్వం తీసుకుని అభివృద్ధి చేస్తుంది' అని తెలిపారు. పరిశ్రమలకు కూడా ఇక్కడ అవకాశం ఇస్తే
ఎగుమతులు పెరుగుతాయన్నారు. గతంలో ఈ ప్రాజెక్టును ప్రారంభించి.. మొదలు పెట్టిన పనులను గత పాలకులు నిలిపివేసినట్లు చెప్పారు. ఈసారి బందరు పోర్టు పనులు పూర్తి చేసి చూపుతామన్నారు. పోర్టులో నాలుగు బెర్తులు ఉన్నాయని.. వాటిని పెంచాల్సిన అవసరం ఇప్పుడు లేదన్నారు. అవసరమైతే భూసమీకరణ మళ్లీ చేపడతామన్నారు. బందరు పోర్ట్ , రైల్వే లైన్, జాతీయ రహదారులతో మచిలీపట్నం రూపు రేఖలు మారిపోతాయన్నారు. ప్రభుత్వ ఆస్తులను గత ప్రభుత్వం దోచుకుందని, వాటిపై విచారణ చేసి స్వాధీనం చేసుకుంటామన్నారు. బందరు కళాశాలకు పూర్వవైభవం తీసుకొస్తామని సీఎం తెలిపారు. మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ బాలశౌరి తదితరులు సీఎం పర్యటనలో ఉన్నారు. ఇదిలావుంటే ప్రజలకు సీఎం చంద్రబాబు మూడు గుడ్ న్యూస్‌లు చెప్పారు. ఇవాళ్టి నుంచి చెత్త పన్ను వసూలు పూర్తిగా నిలిపివేయాలని ఆదేశించారు. అంతే కాకుండా డ్వాక్రా సంఘాలను ఇకపై చిన్నతరహా పరిశ్రమలుగా గుర్తిస్తామని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని స్వచ్ఛాంధ్రప్రదేశ్ గా మార్చేందుకు కృషి చేస్తున్న వారి కోసం ప్రత్యేకంగా గ్రూప్‌లు ఏర్పాటు చేయబోతున్నట్టు వెల్లడించారు. దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చిన గాంధీజీ ఆశయాలు మేరకు వచ్చిదే స్వచ్ఛ భారత్ నినాదమన్నారు.

# కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య.. చౌకబారు రాజకీయం!




హైదరాబాద్: కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య.. మంత్రి కొండా సురేఖ, మాజీ మంత్రి కేటీఆర్‌ల మధ్య రాజకీయ వివాదం 'చౌకబారు' మలుపు తీసుకుంది. సినీనటి సమంత విడాకులు, రకుల్ ప్రీత్‌సింగ్ పెళ్లి, డ్రగ్స్, ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాలను లేవనెత్తుతూ కేటీఆర్‌పై మంత్రి కొండా సురేఖ చేసిన అనుచిత వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. బాధ్యతగల మంత్రి హొదాలో ఉన్న ఆమె.. నైతికతను పట్టించుకోకుండా అక్కినేని నాగార్జున కుటుంబంపై ఆక్షేపణీయ వ్యాఖ్యలు చేయడం, దానికి కేటీఆర్ బాధ్యుడంటూ ఆరోపణలు చేయడంతో కలకలం మొదలైంది.

రాజకీయ నేతలు, సినీ ప్రముఖులు కొండా సురేఖ వ్యాఖ్యలను తీవ్రంగా తప్పుపడుతున్నారు. రాజకీయపరమైన వివాదాల్లోకి సంబంధం లేని ఓ కుటుంబ అంతర్గత వ్యవహారాన్ని లాగడం, ఉచితానుచితాలను పట్టించుకోకుండా ఇష్టం వచ్చిన ఆరోపణలు చేయడం సరికాదని మండిపడుతున్నారు. తెలంగాణలో మహిళలంతా సంబురంగా జరుపుకొనే బతుకమ్మ పండుగ వేళ.. మహిళలపై అనుచిత వ్యాఖ్యలు, మహిళలే ఆక్షేపణీయ విమర్శలు చేయడం చర్చనీయాంశంగా మారింది.

అసలేమైందంటే...!

ఈ మొత్తం వివాదం వెనుక ఇటీవల మంత్రి కొండా సురేఖ మెదక్ పర్యటన సందర్భంగా జరిగిన ఘటన, దానిపై బీఆర్ఎస్ పేరిట సోషల్ మీడియాలో జరిగిన ట్రోలింగ్‌తో బీజం పడింది. అక్కడ జరిగిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మెదక్ ఎంపీ రఘునందన్‌రావు ఒక నూలు దండను మంత్రి సురేఖ మెడలో వేశారు. కొందరు ఈ ఫోటోను పెట్టి అసభ్య భావంతో ట్రోలింగ్ చేశారు. దీనిపై కొండా సురేఖ ఆవేదన వ్యక్తం చేశారు.

సురేఖపై ట్రోలింగ్‌కు నిరసనగా కొందరు కాంగ్రెస్ కార్యకర్తలు, చేనేత కార్మికులు తెలంగాణ భవన్ వద్ద ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం మీడియాతో కేటీఆర్ చిట్‌చాట్ చేస్తూ కొండా సురేఖను విమర్శించారు. తనను ట్రోల్ చేశారంటూ సురేఖ దొంగ ఏడుపులు ఏడుస్తున్నారని వ్యాఖ్యానించారు. అనంతరం కొండా సురేఖ తీవ్రంగా స్పందిస్తూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు.

అక్కినేని కుటుంబాన్ని ప్రస్తావిస్తూ..

గాంధీ జయంతి సందర్భంగా మహాత్ముడికి నివాళు లర్పించిన అనంతరం బాపూఘాట్ వద్ద, గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ కేటీఆర్‌పై విరుచుకుపడ్డారు. తన వ్యక్తిత్వాన్ని హత్య చేయాలని బీఆర్ఎస్ నేతలు చూస్తున్నారని.. అలాంటప్పుడు తాను దొంగ ఏడుపులు ఎందుకు ఏడుస్తానని ప్రశ్నించారు. సినీ నటి సమంత, నాగార్జున కుమారుడు నాగచైతన్య విడిపోవడానికి కేటీఆరే కారణమని.. ఆయన చాలా మంది హీరోయిన్లను బెదిరించి లొంగదీసుకునే ప్రయత్నం చేశారని వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. "నాగచైతన్య, సమంత విడిపోవడానికి కారణం కేటీఆరే.

చాలా మంది హీరోయిన్లు సినిమా ఫీల్డ్ నుంచి తప్పుకుని త్వరగా పెళ్లిళ్లు చేసుకోవడానికి కారణం కూడా కేటీఆరే. ఆయన డ్రగ్స్‌కు అలవాటు పడి, వాళ్లకూ డ్రగ్స్ అలవాటు చేశారు. వాళ్ల జీవితాలతో ఆడుకునేలా బ్లాక్‌మెయిల్ చేసి ఇబ్బందులు పెట్టారు. వాళ్లను డ్రగ్స్ కేసులో ఇరికించి ఆయన తప్పుకున్నారు. వాళ్ల ఫోన్లు ట్యాప్ చేసి, రహస్యంగా మాట్లాడుకున్న విషయాలను రికార్డు చేసి వాళ్లకు వినిపించేవారు.

ఆ రికార్డులను అడ్డుపెట్టుకుని బెదిరించేవారు" అని కొండా సురేఖ ఆరోపించారు. నిజానికి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కేటీఆర్ తనను ట్రోల్ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని, కానీ అలా ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి గురించి, మంత్రి సీతక్క గురించి కూడా గతంలో ఇలాంటి పోస్టులే

పెట్టారని.. ఇప్పుడు తనపై పెడుతున్నారని మండిపడ్డారు. తనపై ట్రోలింగ్ చేసినవారు, వారి వెనుక ఉండి నడిపిస్తున్న వారిపై కేసులు పెడుతున్నామని చెప్పారు.

కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్..

కొండా సురేఖపై ట్రోలింగ్, ఆమె చేసిన వ్యాఖ్యల వ్యవహారం బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతల మధ్య మాటల మంటలు రేపుతోంది. మెదక్ ఘటనపై సోషల్ మీడియాలో బీఆర్ఎస్ అనుయాయులు చేసిన ట్రోల్స్‌పై కొండా సురేఖ, ఇతర కాంగ్రెస్ నేతలు తీవ్రంగా మండిపడ్డారు. దీనిపై కేటీఆర్ స్పందిస్తూ.. తప్పుడు వ్యాఖ్యలు చేస్తున్న మంత్రుల నోర్లు ఫినాయిల్‌తో కడుక్కోవాలని వ్యాఖ్యానించారు. మరో మంత్రి సీతక్క తిరిగి కేటీఆర్ నోరే యాసిడ్‌తో కడుక్కోవాలని విమర్శించారు.

## డబ్బుల కోసంమే మూసీ సుందరీకరణ

ఇస్తాను అని తెలిపారు. మూసీ విషయంలో సీఎంకు, మంత్రులకు సయోధ్య ఉన్నట్లు లేదన్నారు. మూసీ ప్రాజెక్టుకు లక్షన్నర కోట్లని ఎవరు చెప్పారని శ్రీధర్ బాబు అంటున్నారు. అభినవ గోబెల్స్ రేవంత్ రెడ్డి ఈ విషయాన్ని చెప్పారని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ సీఎం మంత్రివర్గ విస్తరణ కూడా చేసుకోలేని అసమర్థుడు అని కేటీఆర్ విమర్శించారు. డబ్బు సంచుల కోసమే మూసీ ప్రాజెక్టుకు రాహుల్ అనుమతి ఇచ్చారు. రేవంత్ రెడ్డి కాదు.. రాహుల్ గాంధీనే హైడ్రాను నడిపిస్తున్నారు. రాహుల్ వెనుకుండి పేదల ఇండ్లపైకి బుల్డోజర్ నడిపిస్తున్నారు. కేవలం డబ్బుల కోసమే మూసీ ప్రాజెక్టును రాహుల్ చేపట్టారు. బుల్డోజర్ ప్రభుత్వంతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే రాహుల్ ఎక్కడున్నారు.. మూసీ ప్రాజెక్టును ఏ కాంట్రాక్టర్‌కు ఇస్తారో త్వరలో బయటపెడుతా. కాంగ్రెస్‌కు నోట్ల కట్టలు కావాలి.. కానీ బాధితుల కష్టాలు పట్టవా.. అని కేటీఆర్ నిలదీశారు.

## వడ్డీల పేరుతో వేధిస్తే కఠిన చర్యలు



**ఏలూరు కాల్ మనీ ఘటనపై హోంమంత్రి స్పదన**

**అవసరమైతే క్రిమినల్ కేసులు తప్పవన్న అనిత**

**అమరావతి:** వడ్డీల పేరుతో సామాన్య ప్రజలను ఇబ్బంది పెడితే సహించేది లేదని ఏపీ హోంమంత్రి అనిత హెచ్చరించారు. ఏలూరు కాల్ మనీ ఘటనపై ఆమె స్పందించారు. కిస్తీలకు ముందే వడ్డీ కోత, సమయం దాటితే డబుల్ కిస్తీ పేరుతో చేసే కాల్ మనీ వ్యవహారంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. అధిక వడ్డీలు, అక్రమ వసూళ్లతో వేధిస్తే క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటివి జరగకుండా ప్రత్యేక నిఘా వ్యవస్థ ఏర్పాటు చేసినట్లు చెప్పారు.
రోజూవారీ వడ్డీ పేరుతో సామాన్య ప్రజలను జలగల్లా పీల్చిపిప్పి చేసే వారిని సహించబోమన్నారు. వసూళ్ల పేరుతో అమాయకులను బలిచేసే వారిపై ఉక్కుపాదం మోపుతామని చెప్పారు. వడ్డీ వ్యాపారాలను సీరియస్‌గా తీసుకున్నామని మంత్రి అనిత తెలిపారు. వైకాపా నేత కాల్ మనీ దందాకు తాము బలయ్యామని ఇటీవల ఏలూరులో బాధితులు ఆరోపించారు. అప్పు ఇచ్చి దానికి ఇష్టమొచ్చినట్లు వడ్డీలు కట్టించుకునే వారని, సమయానికి కట్టకపోతే అసభ్యపదజాలంతో తిట్టేవారని వాపోయారు. భయపడి కట్టినా ఇంకా బకాయి ఉన్నారంటూ వేధించేవారని పేర్కొన్నారు. అప్పు ఇచ్చిన సమయంలో తీసుకున్న ప్రామిసరీ నోట్లతో ఇప్పుడు కోర్టుల చుట్టూ తిప్పుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే ఏలూరు ఎస్పీతో మంత్రి అనిత ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.

## శ్రీవారిని దర్శించుకున్న పవన్ కళ్యాణ్

**అనంతరం ప్రాయశ్చిత్త దీక్ష విరమణ**

**వేదాశీర్వచనం చేసిన పండితులు**

**కూతుళ్లతో కలసి తిరుమల శ్రీవారి దర్శనం**

**చిన్నకూతురుతో డిక్లరేషన్ ఇచ్చిన పవన్**



**తిరుమల:** డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వ్యవహారంపై ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టిన పవన్... దీక్ష విరమణ కోసం తిరుమలకు వచ్చారు. మంగళవారం కాలిబాటన తిరుమలకు వచ్చిన ఉపముఖ్యమంత్రి బుధవారం ఉదయం స్వామివారిని దర్శించుకున్నారు. తన ఇద్దరు కుమార్తెలతో కలిసి మహాద్వారం గుండా ఆలయంలోకి పవన్ ప్రవేశించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద ఆయనకు టీటీడీ అధికారులు స్వాగతం పలికారు. అనంతరం తన ఇద్దరు కుమార్తెలతో కలిసి పవన్ శ్రీవారిని దర్శించుకున్నారు. దర్శనం సమయంలో వారాహి డిక్లరేషన్ బుక్‌ను స్వామి వారి పాదాల వద్ద ఉంచి ఆశీస్సులు పొందారు. ఆ పుస్తకాన్ని చేత పట్టుకొని ఆలయం వెలుపల మీడియాకు ప్రత్యేకంగా చూపించారు. సనాతన ధర్మానికి సంబంధించిన అంశాలతో బుక్‌ను రూపొందించినట్లు సమాచారం. గురువారం వారాహి సభలో పుస్తకంలోని అంశాలను ప్రజలకు డిప్యూటీ సీఎం తెలియజేయనున్నారు. దర్శనం తర్వాత అన్నదానం కేంద్రం వద్దకు చేరుకున్నారు. అన్నప్రసాదంలో అన్నప్రసాదాన్ని పవన్ స్వీకరించారు. అన్నదానంలో తనిఖీలు ముగించి
అక్కడి నుంచి గాయత్రి నిలయానికి పవన్ కళ్యాణ్ బయలుదేరి వెళ్లారు. కాగా.. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పెద్ద కూతురు ఆధ్య, కుమారుడు అఖిరా నందన్ తరచూ మీడియా ముందుకు రావడంతో వారిద్దరూ అందరికీ సుపరిచితమే. అయితే పవన్ తన చిన్న కుమార్తె పలీనా అంజని కొణిదెలను మాత్రం తొలిసారి మీడియా ముందుకు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా పలీనా అంజని తిరుమల శ్రీవారి దర్శనానికి డిక్లరేషన్ ఇచ్చారు. పలీనాతో డిక్లరేషన్ పత్రాలపై పవన్ సంతకాలు చేయించారు. టీటీడీ ఉద్యోగులు తీసుకువచ్చిన డిక్లరేషన్ పత్రాలపై సంతకాలు చేశారు. అయితే పలీనా అంజని మైనర్ అయినందున తండ్రిగా పవన్ కళ్యాణ్ కూడా ఆ పత్రాలపై సంతకాలు చేశారు. మరోవైపు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పర్యటనలో మీడియాపై టీటీడీ ఆంక్షలు విధించింది. ఆలయం వద్ద గొల్లమండపంకే మీడియాను పరిమితం చేసింది. పవన్ కళ్యాణ్ ఆలయం వెలుపలకి వచ్చిన సమయంలోనూ మీడియాను బయటకు రాకుండా టీటీడీ అధికారులు అడ్డుకున్నారు. అటు అన్నదాన సముదాయంలోకి మీడియాకు నో ఏంట్రీ విధించారు. ఈ క్రమంలో టీటీడీ, భద్రతా సిబ్బంది తీరుకు నిరసనగా మీడియా ప్రతినిధులు ఆందోళనకు దిగారు...
కాగా.. ప్రాయశ్చిత్త దీక్షను విరమించేందుకు నిన్న మధ్యాహ్నమే పవన్ తిరుమలకు చేరుకున్నారు. గన్నవరం విమానాశ్రయం నుంచి బయలుదేరిన పవన్ మధ్యాహ్నం 3.30 గంటలకు రేణిగుంట ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. నడకమార్గం ద్వారా తిరుమలకు వెళ్లాలనుకున్న ఆయన.. ఎయిర్‌పోర్టు నుంచి అలిపిరి పాదాల మండపం వద్దకు చేరుకున్నారు. భద్రతా సమస్య ఉన్న నేపథ్యంలో రోడ్డు మార్గం ద్వారా తిరుమలకు వెళ్లాలని పోలీసులు సూచించారు. దీంతో అలిపిరి నుంచి తిరుపతిలోని శ్రీపద్మావతి అతిథిగృహానికి చేరుకున్నారు. మెట్ల మార్గంలో వెళ్లి దీక్ష విరమించనున్నట్టు ఇదివరకే ప్రకటించడంతో... సాయంత్రం 4.50 ప్రాంతంలో అలిపిరి చేరుకున్నారు. అలిపిరి పాదాల మండపం వద్ద సాష్టాంగ నమస్కారం చేసి పటిష్ఠ భద్రత మధ్య పవన్ కళ్యాణ్ నడక మొదలుపెట్టారు. రెండు మోకాళ్లకు బెల్ట్‌లు (నీ క్యాప్) ధరించారు. అయినప్పటికీ మెట్లు ఎక్కేక్రమంలో పవన్‌లో అలసట కనిపించింది. మధ్యమధ్యలో ఎక్కువ విశ్రాంతి తీసుకోవాల్సి వచ్చింది. మోకాళ్ల పర్వతం వరకు వేగంగా నడిచారు. అక్కడ కాళ్ల నొప్పి తీవ్రం కావడంతో ఫిజియోథెరపీ తీసుకోవాల్సి వచ్చింది. ఒకదశలో మోకాళ్ల పర్వతం నుంచి వాహనంలో తిరుమలకు వెళతారన్న ప్రచారం జరిగింది. దీనికి అనుగుణంగా సిబ్బందీ అప్రమత్తం అయ్యారు. అయితే, ఏడో మైలు నుంచి నెమ్మదిగా నడుచుకుంటూ రాత్రి 9.20 గంటల ప్రాంతంలో తిరుమలకు చేరుకున్నారు.

# గాంధేయ మార్గం ఆదర్శం, అనుసరణీయం.

## - జయంతి వేడుకల్లో కలెక్టర్, మేయర్.

వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, అక్టోబర్ 02 : గాంధేయ మార్గం అందరికి ఆదర్శం, అనుసరణీయమని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, నగర మేయర్ దండు నీతూకిరణ్ అన్నారు. జాతిపిత మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని బుధవారం నిజామాబాద్ నగరంలోని గాంధీచౌక్ లో గల మహాత్ముని విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అదేవిధంగా మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఇరువురు జాతి నేతలు దేశానికి అందించిన సేవల గురించి కొనియాడారు. జాతిపిత చూపిన బాటలో పయనిస్తూ దేశాభ్యున్నతికి, సమాజ హితానికి పాటుపడాలని పిలుపునిచ్చారు.

కాగా, సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోనూ జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ట్రైనీ కలెక్టర్ సంకేత్ కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి, గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ అంకిత్, నగర పాలక సంస్థ కమిషనర్ మకరంద్, డీఆర్డీఓ సాయాగౌడ్, కలెక్టరేట్ ఏ.ఓ ప్రశాంత్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వరద బాధితుల సహాయార్థం విద్యార్థుల విరాళం





కాగా, ఇటీవల ఏకధాటిగా కురిసిన భారీ వర్షాల కారణంగా నష్టపోయిన వరద బాధితుల సహాయార్థం జానకంపేట్ లోని ఇమేజ్ స్కూల్ విద్యార్థులు ఆర్థిక సహాయం అందించారు. మహాత్ముని జయంతి కార్యక్రమానికి హాజరైన సందర్భంగా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతును కలిసి, వరద బాధితుల సహాయార్థం రూ. 16,116 విలువ గల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను, పాఠశాల నిర్వాకులను, సిబ్బందిని కలెక్టర్ అభినందించారు.




# టియు దక్షిణ ప్రాంగణంలో బతుకమ్మ సంబరాలు.

**వేగుచుక్క న్యూస్, భిక్నూర్, అక్టోబర్ 2:**



తెలంగాణ విశ్వవిద్యాలయం దక్షిణ ప్రాంగణంలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయంలోని వివిధ డిపార్ట్మెంట్ల వారీగా, వివిధ రంగురంగుల పువ్వులతో బతుకమ్మలను పేర్చారు. ఈ కార్యక్రమాన్ని దక్షిణ ప్రాంగణంలో ఉమెన్ సెల్ అసిస్టెంట్ డైరెక్టర్ కె. వైశాలి ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన దక్షిణ ప్రాంగణ ప్రిన్సిపల్ డాక్టర్ సుధాకర్ గౌడ్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ రాజేశ్వరి మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతిరూపం మన బతుకమ్మ అన్నారు. భారత దేశ సంస్కృతిలోనే ఒక ప్రత్యేకమైన స్థానంలో తెలంగాణను బతుకమ్మ పండుగ నిలబెట్టిందని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ రాజేశ్వరి, అసిస్టెంట్ సెల్ డైరెక్టర్ కే వైశాలి, డాక్టర్ హరిత, డాక్టర్ లలిత, డా. సునీత, డా. రమాదేవి, డా. శ్రీమాత, మోహన్ బాబు, అంజయ్య, యాలాద్రి, నరసయ్య, నారాయణ గుప్తా, శ్రీకాంత్, దిలీప్ ఇంద్రకరణ్ రెడ్డి, పోతన్న, సునీల్, శ్రీనివాస్ వివిధ డిపార్ట్మెంట్ల విద్యార్థులు పాల్గొన్నారు.

# మద్యపాన నిషేధన్ని అమలు చేయాలి.

## మహాత్మా గాంధీ కి అర్బన్ ఎమ్మెల్యే దన్ పాల్ నివాళి.

**వేగుచుక్క న్యూస్, నిజమాబాద్, అక్టోబర్ 2:**

భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో బుధవారం నగరంలో నిర్వహించిన మహాత్మా గాంధీ జయంతి ఉత్సవాలకు అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం గాంధీ చౌక్ లో ఉన్న మహాత్మా విగ్రహానికి బిజెపి శ్రేణులతో కలిసి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, సత్యం, అహింస వాదంతో భారతదేశనికి స్వాతంత్రం తెచ్చిన మన జాతిపిత మహాత్మా గాంధీ సేవలు మరువలేనివని ఆయన జీవన విధానం యావత్ భారత్ కి మార్గదర్శనం అన్నారు. స్వరాజ్యం సిద్ధించి ఏడు వసంతాలు పూర్తి అవుతున్న ఆ మహనీయుడు కలలు కన్న స్వరాజ్యం మనం సాధించలేకపోయాం అనేది వాస్తవం అన్నారు. మహాత్మా జీవిత చరిత్ర, ఆయన బోధించిన సూక్తులు మరిచి నేటి సమాజం నరరూప రాక్షసులుగా మారిన వైనం మనం చూస్తున్నాం అన్నారు. యువత మారకద్రవ్యల మత్తులో చిందులేస్తుందని, ఆనాడు గాంధీ అర్ధరాత్రి ఆడబిడ్డ ఒంటరిగా నిర్భయంగా తిరిగినప్పుడు నిజమైన స్వాతంత్రం వచ్చినట్లు అన్నారని, కానీ నేడు పట్టపగలు ఆడబిడ్డలకు రక్షనే లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేసారు. చిన్న పిల్లల దగ్గరినుండి పండు ముసలమ్మా వరకు నేటి



సమాజంలో అఘాత్యాలు జరుగుతున్నాయన్నారు. చిన్న, చిన్న తాగదాలతో అన్న తమ్ములు, చెడు వ్యసనాలకు బానిసలై తల్లితండ్రులను కొడుకులు, పిల్లలను తల్లితండ్రులు చంపుకునే దౌర్భాగ్యమైన స్థితిలో నేటి సమాజం చేరుకోవడం నిజంగా యావత్ సమాజం తలదించుకునే పరిస్థితి ఉందన్నారు.ప్రభుత్వాలు ఏవైనా కఠిన నిర్ణయాలు తీసుకోని విటన్నిటికీ కారణం అవుతున్న మద్యపాన నిషేధం విధించాలని

ప్రభుత్వలను డిమాండ్ చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక విపరీతంగా గల్లీకో మద్యం దుకాణం వెలిసాయన్నారు. పల్లెల్లో మళ్ళీ గుడుంబా గుప్పుమంటుందనీ, పూటకో మర్డర్, మానభంగం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్పొరేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

# టియులో ఘనంగా గాంధీజీ జయంతి వేడుకలు.

**వేగుచుక్క న్యూస్, బిక్నూర్, అక్టోబర్ 2:**






గాంధీజీ జయంతిని పురస్కరించుకొని తెలంగాణ విశ్వవిద్యాలయం దక్షిణ ప్రాంగణంలో బుధవారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ అంజయ్య మాట్లాడుతూ, గాంధీజీ అడుగుజాడల్లో ప్రతి ఒక్కరు నడవాలని, అహింసా పద్ధతులను పాటించాలని, గాంధీ సిద్ధాంతాలను పునికిపుచ్చుకోవాలని ఆకాంక్షించారు. అలాగే గాంధీయవాదమే ప్రతి ఒక్కరికి ఆదర్శనీయమని, గాంధీ సూత్రాలు దేశ స్వతంత్రంలో ప్రముఖ పాత్ర వహించాయని కొనియాడారు. అంతకుముందు క్యాంపస్ ఆవరణలో ప్లాస్టిక్ వ్యర్థాలను, చెత్తా చెదారాన్ని సేకరించి పరిసరాలను శుభ్రపరిచారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# హైడ్రాకు మరిన్ని అధికారాలు

హైదరాబాద్: హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ ఎసెట్ ప్రొటెక్షన్ హైడ్రాకు హై పవర్స్ వచ్చాయి. హైడ్రా ఆర్డినెన్స్‌కు గవర్నర్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఇకపై హైడ్రాకు ప్రత్యేక చట్టం కల్పించారు. మున్సిపల్ చట్టంలో 374 – బీ సెక్షన్ చేరుస్తూ ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేసింది. హైడ్రాకు ఎదురవుతున్న ఆటంకాలు తొలగిస్తూ ప్రత్యేక ఆర్డినెన్స్ రూపకల్పన చేసింది. ఈ ఆర్డినెన్స్‌ను కేబినెట్ ఆమోదం తెలపడంతో ఫైల్‌ను రాజ్ భవన్‌కు పంపింది. ఈ ఆర్డినెన్స్‌కు గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ఆమోదం తెలిపారు. గవర్నర్ వ్యక్తం చేసిన పలు సందేహాలకు మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిషోర్ వివరణ ఇచ్చారు. ప్రభుత్వ వివరణలతో సంతృప్తి చెందిన గవర్నర్ హైడ్రా ఆర్డినెన్స్ ÷ల్‌పై సంతకం చేశారు. దీన్ని రాజ్ భవన్ వర్గాలు అధికారికంగా వెల్లడించాయి. జీహెచ్ఎంసీ చట్టం 1955లో 374 బీ సెక్షన్ చేరుస్తూ ఆర్డినెన్స్ జారీ చేశారు. ఓఆర్ఆర్ పరిధి వరకు ప్రభుత్వ ఆస్తులు, చెరువులు, నాలాలు పరిరక్షిస్తూ సర్వాధికారాలు ఇచ్చేలా చట్టం రూపొందించారు. జిల్లా కలెక్టర్, ఎమ్మార్వో, వాల్టాయాలోని అధికారాలు హైడ్రాకు బదలాయించారు. కాగా మూసీ సుందరీకరణలో మరో అడుగుపడింది. డ్రోన్ సర్వే ద్వారా గుర్తించిన నదీ గర్భం (రివర్ బెడ్)లో ఉన్న ఇళ్ల కూల్చివేత మొదలైంది. స్వచ్ఛందంగా తరలివెళ్లినవారి నివాసాలను తొలగిస్తున్నారు. వీరికి డబుల్‌బెడ్ రూం ఇళ్ల తాళాలు అప్పగించాకనే.. మూసీలో ఖాళీ చేసిన ఇళ్లను పడగొడుతున్నారు. ప్రజలు నివసిస్తున్న వాటి జోలికి వెళ్లడం లేదు. మంగళవారం రెవెన్యూ అధికారులు, పోలీసుల పర్యవేక్షణలో హైదరాబాద్‌లోని నాంపల్లి, సైదాబాద్, హిమాయత్‌నగర్ మండలాల పరిధి శంకర్‌నగర్, వినాయక వీధిలో ఇళ్ల కూల్చివేత చేపట్టారు. ఈ ప్రాంతాల్లో 333 నిర్మాణాలుండగా 300 ఇళ్లకు రివర్ బెడ్ మార్కింగ్ పెట్టారు. 83 ఇళ్లను పడగొట్టినట్లు అధికారులు తెలిపారు. వీటిలో ఎక్కువగా రేకుల షెడ్లు ఉన్నాయి. ఇరుకు గల్లీల్లో ఉండడంతో పొ÷–లకెయిన్లు లేకుండా కూలీలను ఏర్పాటు చేసి నెమ్మదిగా పడగొడుతున్నారు. ఇంటి సామగ్రిని తీసుకెళ్లేందుకు నిర్వాసితులకు అవకాశం కల్పించారు.

వస్తువుల తరలింపునకు ప్రత్యేక వాహనాలను అందుబాటులో ఉంచారు. నిర్వాసితులను మలక్‌పేట్‌లోని పిల్లి గుడిసెలు, ఉప్పల్‌లోని ప్రతాప సింగారంలో ఉన్న డబుల్ బెడ్ రూం ఇళ్ల సముదాయానికి తరలిస్తున్నారు. కాగా, శంకర్‌నగర్‌లో కొందరు నిరసన వ్యక్తం చేశారు. చిన్న డబుల్ బెడ్ రూంలలో పెద్ద కుటుంబాలు ఎలా ఉంటాయని వాపోయారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేయగా పోలీసులు సముదాయించారు. మూసీతో తలెత్తే ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని చాలామంది ఖాళీ చేసేందుకు ముందుకొస్తున్నారు. ఇద్దరు, ముగ్గురు పిల్లలున్న కుటుంబాలు సంతోషంగా వెళ్తుండగా, 6 నుంచి 10 మంది ఉన్నవారు భావోద్వేగానికి గురవుతున్నారు. శనివారం నుంచి 148 మంది వెళ్లినట్లు హైదరాబాద్ ఆర్డీవో మహిపాల్ తెలిపారు. నాంపల్లి నుంచి జియాగూడలోని డబుల్ బెడ్‌రూంలకు 24 మందిని తరలించినట్లు చెప్పారు. మూసీ సుందీకరణ ప్రాజెక్టులో.. హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల్లో డ్రోన్ సర్వే ద్వారా 2,166 నిర్మాణాలను గుర్తించారు. 1,478 ఇళ్లకు రివర్ బెడ్ మార్కింగ్ వేశారు. హైదరాబాద్ జిల్లాలో 1,595 నిర్మాణాలకు గాను 1,333కు మార్కింగ్ పెట్టారు. అధికారులు కౌన్సెలింగ్ ఇస్తూ డబుల్ బెడ్‌రూమ్‌లకు తరలించే చర్యలు తీసుకుంటున్నారు. నిర్వాసితుల నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# సమరయోధుల స్ఫూర్తిని కొనసాగించాలి.

## - స్కౌట్స్ అండ్ గైడ్స్ రాష్ట్ర ప్రతినిధి కె. సాల్మన్.

**వేగుచుక్క న్యూస్, సిరికొండ, అక్టోబర్ 2:**

ప్రపంచానికి అహింసా సిద్ధాంతాన్ని అందించిన మహాత్మ గాంధీ, దేశ సమగ్రతకు, ఐక్యతకు కృషి చేసిన లాల్ బహదూర్ శాస్త్రీ స్ఫూర్తితో సమాజ ప్రగతికి పాటుపడాలని స్కౌట్స్ అండ్ గైడ్స్ రాష్ట్ర ప్రతినిధి కె. సాల్మన్ పేర్కొన్నారు. స్వాతంత్ర సమరయోధులు జాతిపిత మహాత్మా గాంధీ 155వ, మాజీ ప్రధాని భారతరత్న లాల్ బహదూర్ శాస్త్రిల 120వ జయంతులను సత్యశోధక్ పాఠశాలలో బుధవారం ఘనంగా నిర్వహించారు.

బాపూజీ, శాస్త్రీల చిత్రపటాలకు సాల్మన్, డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు ఎం. బాలయ్యలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బ్రిటిష్ పాలన విముక్తి కోసం దేశ ప్రజందరికి స్వరాజ్య కాంక్ష అవశ్యకతను తెలియపరచి, 'సత్యమే వజయతే' అని కోట్లాది భారతీయులకు స్వేచ్ఛ, స్వాతంత్ర్యాన్ని అందించుటకు శాంతియుత మార్గంలో పోరాడి యావత్ ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిన గాంధీజీ,



దేశభక్తి, నీతి, నిజాయితీ, క్రమశిక్షణలతో 'జై జవాన్, జై కిసాన్' నినాదంతో దేశాన్ని సైనికపరంగా, వ్యవసాయపరంగా పటిష్ట పరిచిన శాస్త్రీజీ లు దార్శనికులన్నారు. నిరంతరం ప్రజల శ్రేయస్సు పల్లె ప్రగతి కోసం పనిచేసే నాయకులు సమకాలీన ప్రపంచానికి అత్యంత అవసరమన్నారు. మహనీయుల ఆశయాలు, కలల సాకారానికి కృషి సల్పితేనే నిజమైన నివాళులు అర్పించిన వారమవుతామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్.నర్సయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

# మంత్రి ఉత్తమ్ ను పరమార్శించిన వినయ్ రెడ్డి.

**వేగుచుక్క న్యూస్, ఆర్మూర్, అక్టోబర్ 2:**



రాష్ట్ర పౌర సరఫరాలు, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ని ఆర్మూర్ నియోజకవర్గం ఇంచార్జి వినయ్ రెడ్డి బుధవారం హైదరాబాద్ లోని ఆయన నివాసంలో పరమార్శించారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి తండ్రి పురుషోత్తం రెడ్డి ఇటీవల మృతి చెందడంతో కొండపూర్ లోని మంత్రి ఇంటికి వెళ్లి, పురుషోత్తం రెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఉత్తమ్ కుమార్ రెడ్డితో పాటు అయన సతీమణి కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి, వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి వారిని పరమార్శించారు.

# జిజిహెచ్‌లో మహాత్మాగాంధీ జయంతి.

**వేగుచుక్క న్యూస్, నిజమాబాద్, అక్టోబర్ 2:**

జాతిపిత మహాత్మాగాంధీ జయంతిని బుధవారం జిజిహెచ్ లో ఘనంగా నిర్వహించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమరాజ్ గాంధీజీ చిత్ర పట్టానికి పూల దండ వేసి, ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రతిమరాజ్ మాట్లాడుతూ, మహాత్ముడు నమ్మిన సత్యం, అహింస మార్గంలో మనందరం నడుచుకోవాలని అన్నారు. ప్రతి ఒక్కరు తమ జీవిత విలువలకు తమను తాము పునఃసమీక్షించుకోవడానికి మహాత్ముడి జయంతి ఓ సందర్భం అని ఆమె అభివర్ణించారు. మహాత్ముడి అడుగుజాడల్లో ప్రతి ఒక్కరు నడవాలన్నారు.





# ‘దేవర’.. మరో రైటర్ వర్క్ చేశాడా?



యంగ్ టైగర్ ఎన్టీఆర్ దర్శకుడు కొరటాల శివ కలయిలో వచ్చిన రెండవ సినిమా ‘దేవర’ సినిమా బాక్సాఫీస్ వద్ద మంచి కలెక్షన్స్ రాబడుతోంది. ఇక ఈ సినిమా, ఎన్టీఆర్ అభిమానులకు మాస్ ఎంటర్టైనర్‌గా మారింది. రాజమౌళితో చేసిన సినిమాల తర్వాత హీరోలు ఫ్లాప్ అవుతారనే సెంటిమెంట్‌ను బ్రేక్ చేసిన సినిమా ‘దేవర’. ముఖ్యంగా అనిరుధ్ వర్క్ కూడా సినిమా విజయంలో కీలక పాత్ర పోషించిందని చెప్పవచ్చు.ఇక కొరటాల శివ రచనపై తనకంటూ ప్రత్యేక గుర్తింపు కలిగి ఉన్నారు. ఆయన రాసిన డైలాగులు, కథలోని మెచ్యూరిటీ ఈ సినిమాను నిలబెట్టాయి. అయితే, ‘దేవర’ వెనుక మరో రచయిత హస్తం కూడా ఉందని తాజాగా మరో కొత్త టాక్ వినిపిస్తోంది. అతను మరెవరో కాదు.. శ్రీకాంత్ విస్సా అనే రచయిత. ఈ సినిమాకు కీలకమైన సన్నివేశాలను రాయడంలో అతను సహకరించారట.శ్రీకాంత్ పుష్ప సినిమాకి రైటర్ గా వర్క్ చేశారు. అనంతరం ఒక్కసారిగా అతనికి క్రేజ్ పెరిగింది. ఇక వెంకీ మామ, ఖిలాడి, రావణాసుర సినిమాలకు కూడా వర్క్ చేశారు. ఇక కల్యాణ్ రామ్ ‘డెవిల్’ చిత్రానికి కూడా రైటర్‌గా పని చేశారు. అప్పుడే అతని టాలెంట్ ను గుర్తించిన కళ్యాణ్ రామ్ (నిర్మాత) దేవర స్క్రిప్ట్ విషయంలో కూడా కూడా శ్రీకాంత్ సహకారం కోరాడట.

# కమెడియన్ యోగిబాబు అంటే ఇష్టం: పవన్ కళ్యాణ్



ఒకవైపు రాజకీయాల్లో బిజీగా ఉంటూనే అంగీకరించిన ప్రాజెక్ట్‌లను పూర్తి చేస్తున్నారు పవన్ కల్యాణ్ . తాజాగా ఆయన ఓ తమిళ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో కోలీవుడ్‌లో తనకు నచ్చిన దర్శకుడు, కమెడియన్ గురించి మాట్లాడారు. ప్రస్తుతం దానికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో షేర్ అవుతోంది. తన ఫేవరెట్స్ గురించి పవన్ మాట్లాడుతూ.. ’కమెడియన్ యోగిబాబు అంటే ఇష్టం. ఇటీవల ఆయన నటించిన ఓ సినిమా చూశాను. అందులో సర్పంచిగా యోగి నటన బాగుంది. బాగా నవ్వుకున్నాను. దర్శకుల విషయానికొస్తే.. నాకు మణిరత్నం సినిమాలంటే ఇష్టం. అలాగే లోకేశ్ కనగరాజ్ ఫిల్మ్ మేకింగ్ నచ్చింది. ఆయన దర్శకత్వంలో వచ్చిన ’లియో’, ’విక్రమ్’ సినిమాలు చూశాను. బాగున్నాయి’ అంటూ ప్రశంసించారు. దీంతో పవన్–లోకేశ్ కనగరాజ్‌ల కాంబినేషన్‌లో సినిమా వస్తే బాగుండని అభిమానులు అనుకుంటున్నారు. కానీ, పవన్ ప్రస్తుతానికి రాజకీయాల్లో బిజీగా ఉన్న విషయం తెలిసిందే. గతంలో అంగీకరించిన ప్రాజెక్ట్‌లను మాత్రమే పూర్తి చేయనున్నారు. ప్రస్తుతం పవన్ మూడు సినిమాలు పూర్తి చేయాల్సి ఉంది. ’ఓజీ’, ’ఉస్తాద్ భగత్‌సింగ్’, ’హరిహరవీరమల్లు’ సెట్స్‌పై ఉన్నాయి. పవన్‌కల్యాణ్ కెరీర్‌లోనే భారీ బడ్జెట్, పాన్ ఇండియా, చారిత్రక నేపథ్యం లాంటి విశేషాలతో ’హరిహరవీరమల్లు’ రూపుదిద్దుకుంటోంది. ఇటీవలే దీని షూటింగ్ పునఃప్రారంభమైంది. గ్యాంగ్‌స్టర్ యాక్షన్ థ్రిల్లర్ ఫిల్మ్‌గా ’ఓజీ’ తెరకెక్కుతోంది. హరీశ్ శంకర్ దర్శకత్వంలో ’ఉస్తాద్ భగత్ సింగ్’ రానుంది.



# దసరాకు గేమ్ ఛేంజర్ టీజర్

సంగీత దర్శకుడు థమన్ వెల్లడిమెగా అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న సమయం రానే వచ్చింది. ’గేమ్ ఛేంజర్ టీజర్ ఎప్పుడు వస్తుందా అని వెయిట్ చేస్తున్న మెగా ఫ్యాన్స్‌కు సాలిడ్ అప్‌డేట్ ఇచ్చాడు థమన్. గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ తేజ్, దిగ్గజ దర్శకుడు శంకర్ కాంబినేషన్‌లో వస్తున్న తాజా చిత్రం గేమ్ ఛేంజర్. ఈ సినిమాను అగ్ర నిర్మాత దిల్ రాజు నిర్మిస్తుండగా.. థమన్ సంగీతం అందిస్తున్నాడు. అయితే ఈ సినిమాను క్రిస్మస్ కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఇప్పటినుంచే ప్రమోషన్స్ మొదలుపెట్టారు మేకర్స్. ఇందులో భాగంగానే ఇప్పటికే విడుదల చేసిన.. జరగండి జరగండి, రా మచ్చా, మచ్చా సాంగ్‌లు ఆన్‌లైన్‌లో దూసుకుపోతున్నాయి. అయితే ఈ సినిమా నుంచి టీజర్ ఎప్పుడు వస్తుందా అని అభిమానులు ఎదురుచూస్తున్నారు. ఇదే విషయాన్ని అభిమానులు థమన్‌ను అడిగారు. దీనికి సమాధానంగా దసరా కానుకగా రాబోతుందంటూ ప్రకటించాడు. దీంతో అక్టోబర్ 12న ఈ సినిమా టీజర్ రాబోతున్నట్లు తెలుస్తుంది. భారీ బడ్జెట్‌తో రాబోతున్న ఈ చిత్రంలో బాలీవుడ్ బ్యూటీ కియార అద్వానీ కథానాయికగా నటిస్తుండగా.. సునీల్, ఎస్ జే సూర్య కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

# మహీష టీజర్‌కు మంచి రెస్పాన్స్

ప్రవీణ్ కె.వి., యషిక, పృథ్వీరాజ్, వైష్ణవి, మౌనిక ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సినిమా ’మహీష’. ఈ చిత్రాన్ని స్క్రీన్ ప్లే పిక్చర్స్ బ్యానర్ పై దర్శకుడు ప్రవీణ్ కేవి రూపొందిస్తున్నారు. ఈ సినిమా సెన్సార్ సహా అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని త్వరలో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఇటీవల రిలీజ్ చేసిన ఈ చిత్ర టీజర్‌కు మంచి రెస్పాన్స్ వస్తోంది. ఈ నేపథ్యంలో చిత్ర బృందం ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈసందర్భంగా.. మ్యూజిక్ డైరెక్టర్ శ్రీ వెంకట్ మాట్లాడుతూ – మహీష చిత్రాన్ని వివిధ జానర్స్ కలిపి ఆసక్తికరంగా తెరకెక్కించారు దర్శకుడు ప్రవీణ్. మహీష మూవీలో మంచి మ్యూజిక్ చేసే అవకాశం కలిగింది. పాటలకు రెస్పాన్స్ బాగుంది. అలాగే రీసెంట్ గా రిలీజ్ చేసిన మా మూవీ టీజర్ చాలా మందికి రీచ్ అయ్యింది. మంచి వ్యూస్ దక్కుతున్నాయి. సినిమా కూడా మీ అందరికీ నచ్చేలా ఉంటుందన్నారు. దర్శకుడు, హీరో ప్రవీణ్ కె.వి. మాట్లాడుతూ.. మహీష సినిమాను మా టీమ్ అంతా ఎంతో కష్టపడి రూపొందించాం. సెన్సార్ యూఏ సర్టిఫికెట్ ఇచ్చింది. మంచి సినిమా చేశారంటూ సెన్సార్ వాళ్లు అభినందించారు. చిన్న సినిమాలు ఆడియెన్స్ కు రీచ్ అయ్యేలా చేయడం కష్టం. మీ మీడియా సపోర్ట్ ఉంటేనే అది సాధ్యం. రీసెంట్ గా రిలీజ్ చేసిన మా మూవీ టీజర్ కు దాదాపు రెండు లక్షల వ్యూస్ వచ్చాయి. ఇది పెద్ద నెంబర్ కాకపోవచ్చు కానీ మా మహీష సినిమా టీజర్ ప్రేక్షకులకు నచ్చిందని చెప్పేందుకు ఈ వ్యూస్ నిదర్శనం. మా సినిమాలో విలన్ గా చేసిన విజయ్ రాజ్ గారికి మంచి పేరొస్తుంది. మూవీ కంప్లీట్ చేసి రిలీజ్ కు రెడీగా ఉన్నాం. త్వరలోనే మూవీని గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ చేస్తాం. మహీష సినిమాలో మంచి మేసేజ్ తో పాటు ప్రేక్షకులకు కావాల్సిన ఎంటర్ టైన్ మెంట్ ఉంటుంది. ప్రేక్షకులు మా మహీష మూవీని సపోర్ట్ చేస్తారని కోరుకుంటున్నామన్నారు.





# అనుష్క పెళ్లి పీటలు ఎక్కనుందా?

స్టార్ నటి అనుష్క పెళ్లి కుదిరిందా..త్వరలోనే శుభవార్త వెలువడుతుందా.. ఇప్పుడు ఇదే వార్త హాట్ టాపిక్‌గా మారింది. అక్కినేని నాగార్జున నటించిన సూపర్ సినిమాతో సిల్వర్ స్క్రీన్‌పై మెరిసింది మంగళూరు భామ అనుష్కా శెట్టి (. ఆ తర్వాత తెలుగు, తమిళ భాషల్లో స్టార్ హీరోలతో కలిసి నటిస్తూ వన్ ఆఫ్ ది లీడింగ్ హీరోయిన్‌గా ఓ వెలుగు వెలిగింది. ఓ వైపు గ్లామరస్ పాత్రలు చేస్తూనే మరోవైపు నటనకు ప్రాధాన్యమున్న రోల్స్ చేస్తూ మంచి పేరు సంపాదించింది. అరుంధతి సినిమాతో బాక్సాఫీస్‌ను షేక్ చేసిన ఈ భామ బాహుబలి ఫ్రాంఛైజీతో గ్లోబల్ స్టార్ డమ్ సంపాదించుకుంది.బాహుబలి తర్వాత సినిమాలు తగ్గించిన స్వీటీ మరి పెండ్లి పీటలెక్కేదెప్పుడంటూ సోషల్ మీడియాలో చాలాకాలంగా చర్చ నడుస్తుందని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. తాజాగా దీనికి సంబంధించిన వార్తే నెట్టింట రౌండప్ చేస్తోంది. ఈ భామ త్వరలోనే ఇక ప్రొఫెషనల్ లైఫ్‌కు బ్రేక్ ఇచ్చి వైవాహిక జీవితంలోకి అడుగుపెట్టేందుకు రెడీ అవుతుందట. తాజా టాక్ ప్రకారం అనుష్క దుబాయ్‌కు చెందిన వ్యాపారవేత్తతో ఏడడుగులు వేయనుందట. అనుష్క కుటుంబసభ్యులు ఈ సంబంధాన్ని కుదిర్చారని, తల్లిదండ్రుల పెండ్లి ప్రతిపాదనకు అనుష్క గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసిందని వార్తలు వస్తున్నాయి.

గతేడాది మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి సినిమాతో ప్రేక్షకుల ముందు కొచ్చింది అనుష్క. నవీన్ పొలిశెట్టి హీరోగా నటించిన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేకపోయింది.

## హాలీవుడ్ నటుడు జాన్ అమోస్
# కన్నుమూత



హాలీవుడ్‌లో తీవ్ర విషాదం నెలకొంది. ప్రముఖ నటుడు జాన్ అమోస్ (84) కన్నుమూశారు. ఈ విషయం చాలా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వృద్ధాప్య సమస్యలతో అగష్టు 21న చనిపోగా సుమారు 50 రోజుల తర్వాత అక్టోబర్ 1న బయటి ప్రపంచానికి తెలియడం అశ్చర్యానికి గురి చేస్తోంది. ఆయనకు రెండుసార్లు వివాహం చేసుకోగా ఇద్దరితోనూ డైవర్స్ అయ్యాయి. మొదటి భార్యతో ఇద్దరు సంతానం ఉన్నారు. 1939 డిసెంబర్27న జన్మించిన అమోస్ 1971లో సినిమా కెరీర్ ప్రారంభించి 2023వరకు వివిధ సినిమాలు, టీవీ సిరీస్‌లలో క్యాకరెక్ట్ పాత్రలలో నటిస్తూ ఉన్నారు. ముఖ్యంగా 1977లో వచ్చిన రూట్స్, గుడ టైమ్స్ అనే సిరీస్‌లతో ఓవర్ నైట్ స్టార్‌గా మారిపోయాడు. ఇప్పటివరకు సుమారు 50కి పైగా సినిమాల్లో నటించిన అమోస్ 100కు పైగా సీరియల్స్, సిరీస్‌లలో నటించాడు. చివరగా 2023లో వచ్చిన హాలీవుడ్ సినిమా ది లాస్ట్ పైఫిల్ మ్యాన్ సినిమాలో నటించిన అమోస్ 2022లో ది రైటోస్ జెమ్ స్టోన్స్ అనే సిరీస్‌లో నటించాడు. ఆయన అనేక సిరీస్‌లలో తండ్రి పాత్రలలో నటించడంతో అయనకు అమెరికా వ్యాప్తంగా టీవీ డాడ్ అనే ప్రత్యేక గుర్తింపు కూడా ఉంది. ప్రస్తుతం అమోస్ మరణ వార్త విన్న హాలీవుడ్ ప్రముఖులు ఆయన మృతికి సంతాపం తెలుపుతూ ఆయనతో వారికున్న అనుభవాలను సోషల్ మీడియా వేదికగా పంచుకుంటున్నారు.